




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 95 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి శనివారం 18 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :95 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SAT 18 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

## 25 రోజుల విదేశీ యాత్రకు సీబీఐ కోర్టు అనుమతి

- యూకేతో పాటు యూరప్ దేశాల్లో పర్యటించనున్న జగన్
- కుటుంబంతో కలిసి 25 రోజుల పాటు విదేశీ పర్యటన
- పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు సీబీఐకి ఇవ్వాలని కోర్టు ఆదేశం



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ మరోసారి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూకేతో పాటు యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు అనుమతి కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు, అంటే మొత్తం 25 రోజుల పాటు విదేశాల్లో గడిపేందుకు

మిగతా 2లో



# మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

## ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక బిల్లు కాదన్న లావు
- కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య
- డీలిమిటేషన్ వల్ల రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదన్న లావు

పెన్ పవర్ డెస్క్:దేశాభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై

మిగతా 2లో

# మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?

- మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును వ్యతిరేకించిన పార్టీలపై జగన్ విమర్శలు
- ఈ పరిణామంతో మహిళలకు, దక్షిణ రాష్ట్రాలకు న్యాయం జరగలేదని వ్యాఖ్య
- 2026 జనాభా లెక్కలతో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి నష్టమని ఆందోళన
- కుటుంబ నియంత్రణ పాటించినందుకు శిక్ష అనుభవించాల్సి వస్తోందని పోస్ట్




పెన్ పవర్ డెస్క్:మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన పార్టీలు తాము ఏం సాధించాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందకపోవడం వల్ల మహిళలకు, దక్షిణ భారత రాష్ట్రాలకు ఏకకాలంలో అన్యాయం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026కు మూడింట రెండొంతుల మెజారిటీ లభించని నేపథ్యంలో జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేపడితే దక్షిణ రాష్ట్రాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసలు వాళ్లు ఏం సాధించారు? వాస్తవ పరిస్థితి చూస్తే, దక్షిణాది రాష్ట్రాల సంఖ్యాబలం (సీట్లు) తగ్గిపోతుంది, మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా వాయిదా పడింది. దీనివల్ల దక్షిణాదికి న్యాయం జరగలేదు, మహిళలకూ న్యాయం అందలేదు. ఒకవేళ 2026లో జనాభా లెక్కలు తీస్తే, దక్షిణాది పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. కుటుంబ నియంత్రణ విషయంలో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను మరింతగా శిక్షించినట్లు అవుతుంది. జనాభాను నియంత్రించిన పాపానికి మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ఎంతవరకు సమంజసం? ఇది దక్షిణాదిపై చూపిస్తున్న వివక్ష కాదా? రాజకీయ పార్టీలు ఈ అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉంటున్నాయో అర్థం కావడం లేదు" అని జగన్ ట్వీట్ చేశారు.

# మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు:

- వీగిపోయింది డీలిమిటేషన్ బిల్లేనని, మహిళా బిల్లు కాదని వ్యాఖ్య
- విపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ
- 2023లో ఆమోదం పొందిన బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్
- 543 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం కోటా వర్తింపజేయాలని సూచన

మిగతా 2లో





# క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

- అరేబియా సముద్రంలో క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు వెల్లడి
- ఈ నెల 20 నుంచి 21 వరకు పాకిస్థాన్ నోటమ్ జారీ
- ఈ నెల 22 నుంచి 25 వరకు భారత్ నోటమ్ జారీ

మిగతా 2లో

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

## విపక్షాలపై అమిత్ షా ఫైర్



- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ
- విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు

పెన్ పవర్ డెస్క్:మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం

మిగతా 2లో

# మహిళా బిల్లుతో నవశకం..

## ఏపీలో మాత్రం 'రెడ్‌బుక్' రాజ్యమేలుతోంది: విడదల రజిని

- మహిళా శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చన్న రజని
- మహిళల అభివృద్ధి కోసం సామాజికి సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని కితాబు
- కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు కార్యరూపం దాల్చిన ఈరోజు దేశ చరిత్రలో ఒక గొప్ప రోజని వైసీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని కొనియాడారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ బిల్లుతో దేశ భవిష్యత్తు మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా

మిగతా 2లో



# రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

## కీలక బిల్లు ఓటమిపై రాహుల్ గాంధీ

- లోక్‌సభలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోయింది
- బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు.. మెజారిటీకి 60 ఓట్ల దూరంలో ఓటమి
- మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రను అడ్డుకున్నామన్న రాహుల్ గాంధీ
- డెలిమిటేషన్‌తో రిజర్వేషన్లను ముడిపెట్టడాన్ని 'ఇండియా' కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓటమి పాలైంది. విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ఐక్యంగా

మిగతా 2లో

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్...

## లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు



పెన్ పవర్ డెస్క్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన

మిగతా 2లో

# ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు



- మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి
- పోలీసులకు సమాచారం అందించిన మెట్రో సిబ్బంది
- తనిఖీలు నిర్వహించగా లభ్యం కాని అనుమానాస్పద వస్తువులు


మిగతా 2లో

# ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

## హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

- హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్
- ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి అధికారిక ప్రకటన

మిగతా 2లో



# చెవిరెడ్డి కుటుంబం అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు బయటపెడతా

- చెవిరెడ్డి కుటుంబ అవినీతికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్న పులివర్తి నాని
- వారం రోజుల్లో సినిమా చూపిస్తా అంటూ వార్నింగ్
- చెవిరెడ్డి కొడుకు మోహిత్ రెడ్డివి పిల్ల చేష్టలని ఎద్దేవా
- జగన్‌ను కూడా మోసం చేసిన చరిత్ర ఆ కుటుంబానిదని విమర్శ

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# డీలిమిటేషన్‌తో దేశ ఐక్యతకు భంగం!

కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరిస్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాథం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది. రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది. ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య ౹ఈఖీ (఑బిజీశ్రీ టవతీబితిశ్రీతిబిఎ ఖీజీబివ) సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి.

అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల పంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకసభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో కొద్దో గొప్పో పెరుగనున్నాయి.. ఈ పరిస్థితులను రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో తమ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవడానికి, ఇప్పటినుండే కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఒకవైపు 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన లోకసభ సమావేశాలలో ప్రవేశ పెట్టే బిల్లును లోకసభ సభ్యులకు చేర వేశారు. మరోవైపు 2026 జనాభా ఆధారంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని సదరు బిల్లులో చేర్చారు. రానున్న కాలంలో దేశంలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య దూరం పెరగడమే కాకుండా, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.

# మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు.

మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో వెంటనే 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, తమ నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

# ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

## హార్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హార్మూజ్ ను పూర్తిగా తెరిచినట్టు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం అధికారికంగా వెల్లడించారు."లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హార్మూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు.

అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హార్మూజ్ జలసంధి అత్యంత

వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# మహిళా బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

- మొదటి పేజి తరువాయి

జరిగిన చర్చలో ఆయన పాల్గొని, తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు దక్కిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ చారిత్రాత్మక బిల్లు అమలు కాబోతుండటం అభినందనీయమన్నారు. డీలిమిటేషన్ అంశంపై కూడా టీడీపీ తన స్పష్టమైన వైఖరిని చాటింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. లోక్‌సభ స్థానాల సంఖ్య పెరిగినప్పటికీ, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పు ఉండబోదని, దీనిపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టత ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్ ఒక కీలక అడుగని, దీనివల్ల మహిళలతో పాటు యువతకు కూడా రాజకీయాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సాధికారత కోసం ఎన్నో ఏళ్లుగా సాగుతున్న పోరాటాలకు ఈ బిల్లుతో ఒక తార్కిక ముగింపు లభిస్తుందని లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు.

# మహిళా బిల్లుతో నవశకం..

- మొదటి పేజి తరువాయి

శక్తితో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టవచ్చని, ఇప్పటికే వైసీపీ ఈ బిల్లుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. మహిళల అభివృద్ధి కోసం సామాజిక సంస్కర్తలా ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అని, ఆయన హయాంలో అమలైన 90 శాతం పథకాలు మహిళా సాధికారత కోసమే రూపొందించబడ్డాయని ఆమె పేర్కొన్నారు. అయితే, ఇదే సమయంలో ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విడదల రజని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిపోయిందని, మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. "జగనన్న హయాంలో దిశ యాప్, మహిళా పోలీస్ స్టేషన్లు, జీరో ఎఫ్ఐఆర్ వంటి వినూత్న కార్యక్రమాలతో మహిళలకు భద్రత కల్పిస్తే... నేడు చంద్రబాబు హయాంలో కేవలం 'రెడ్‌బుక్' పాలన మాత్రమే సాగుతోంది" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారంటూ ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్, చంద్రబాబులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిని వెనక్కి తెచ్చారా? అని నిలదీశారు.

మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడుతున్న కూటమి ఎమ్మెల్యేలు, నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రజని ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు వస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో వారి రక్షణను గాలికి వదిలేయడం శోచనీయమన్నారు.

# రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

- మొదటి పేజి తరువాయి

బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో ఉన్న సభ్యులలో మూడింట రెండొంతుల మంది, అంటే 358 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ, ప్రభుత్వానికి 60 ఓట్లు తక్కువయ్యాయి. మహిళా రిజర్వేషన్ల అమలును భవిష్యత్తులో చేపట్టే డెలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియతో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ ఓటమిపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. "సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. 'ఇండియా' కూటమి దానిని ఆపింది. రాజ్యాంగానికి జై" అని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు సంబంధించిన బిల్లు కాదని, డీలిమిటేషన్ పేరుతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర అని ఆయన ఆరోపించారు. మరోవైపు, ఓటర్లు, ఎంపీల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమతుల్యతను సరిదిద్దడానికే డీలిమిటేషన్ అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వాదించారు. సవరణ బిల్లు ఓటమితో, దీనికి సంబంధించిన మరో రెండు బిల్లులను కూడా ముందుకు తీసుకెళ్లబోమని ప్రభుత్వం ప్రకటించింది.

## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు తెలిపాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసాల జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి

ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటిం చింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదే శాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

# చెవిరెడ్డి కుటుంబం అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు బయటపెడతా

తిరుపతి వేదికగా సాగుతున్న రాజకీయ పోరు ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. చంద్రగిరి వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబంపై టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని విరుచుకుపడ్డారు. చెవిరెడ్డి కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలపై తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని, వారం రోజుల్లోనే చెవిరెడ్డికి 'సినిమా చూపిస్తా' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తండ్రి పేరు చెప్పుకుని కోట్లు సంపాదిస్తూ, గర్వంతో ఊగిపోతున్నారంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిపై మండిపడ్డారు. మోహిత్ రెడ్డి చేసేవి చిన్నపిల్లల చేష్టలని, తమ నాయకుడు నారా లోకేశ్ పేరు ఎత్తితే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన తెగేసి చెప్పారు. లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని, ఆయన పనితీరును విమర్శించే స్థాయి మోహిత్ రెడ్డికి లేదని నాని ధ్వజమెత్తారు. వెన్నుపోటు రాజకీయాలకు చెవిరెడ్డి కుటుంబమే బ్రాండ్ అంబాసిడర్ అని పులివర్తి నాని ఎద్దేవా చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి వంటి నేతలనే కాకుండా, చివరకు జగన్‌ను కూడా మోసం చేసిన చరిత్ర ఆ కుటుంబానిదని విమర్శించారు. మద్యం డబ్బులు లెక్కిస్తున్న వీడియోల్లో కనిపిస్తున్న కోట్లాది రూపాయల నగదు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తుడా వ్యవహారంలో జరిగిన భారీ అవినీతిపై విచారణ వేగంగా సాగుతోందని, అవినీతికి సహకరించిన ఏ అధికారిని వదిలిపెట్టేది లేదని, వారం రోజుల్లోనే సస్పెన్షన్లు మొదలవుతాయని హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తలను భయపెట్టడం ఎవరి వల్ల కాదని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు తాను దూరంగా ఉన్నానని, కానీ తమపై అభాండాలు వేస్తే సహించబోనని స్పష్టం చేశారు.

# ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## యూరప్ పర్యటనకు జగన్‌కు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

కోర్టు ఆయనకు అనుమతి మంజూరు చేసింది. అక్రమాస్తుల కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో, విదేశీ ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి కావడంతో జగన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ విదేశీ పర్యటనకు సంబంధించి న్యాయస్థానం కొన్ని కఠినమైన షరతులను విధించింది. ప్రయాణానికి ముందే తన పూర్తి పర్యటన వివరాలు, కాంటాక్ట్ నెంబర్లు, ఈ-మెయిల్ ఐడీ, అవసరమైన ష్యూరిటీ వివరాలను సీబీఐ అధికారులకు సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్న తరుణంలో, జగన్ సుమారు మూడు వారాల పాటు విదేశీ పర్యటనకు వెళుతుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటన ముగించుకున్నాక, మే మధ్యలో ఆయన తిరిగి రాష్ట్రానికి చేరుకోనున్నారు.

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్...

- మొదటి పేజి తరువాయి

ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు. అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి.

ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# గంజాయి రహిత నగరంగా మార్పు చేస్తాం.

## --20 కోట్ల పైగా విలువ గల 4100 కేజీల గంజాయి దహనం.
## -- గంజాయిని నిర్మూలించేందుకు అలసత్వం ఉండదు.
## -- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు.









తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 17. తిరుపతి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే ప్రధాన దయమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి జిల్లాలో పట్టుబడిన సుమారు 4,100 కేజీల గంజాయిని కోర్టు అనుమతి తో డిస్ పోజ్ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట మండలం తుక్కివాకం వద్ద ఉన్న సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ల సమక్షంలో చట్టపరమైన విధానాల ద్వారా డిస్ పోజ్ చేయడం జరిగింది .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గంజాయి పండించడం, రవాణా, వినియోగం పై చాలా కఠినంగా వ్యవహరించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఈగల్ సంస్థను ఏర్పాటు చేసి ఐజీ ర్యాంక్ అధికారిని నియమించి ప్రతి జిల్లాలో అనుబంధంగా అధికారులను ఏర్పాటు చేసి గంజాయి ఇతర డ్రగ్స్ మీద కఠినంగా వ్యవహరించడం జరుగుతున్నదన్నారు. తిరుపతి జిల్లాలో గడిచిన రెండు నుంచి మూడు సంవత్సరాల్లో సీజ్ అయినటువంటి గంజాయిని తూకివాకంలో ఇన్సినరేషన్ పద్ధతి ద్వారా డిస్పోజ్ చేస్తున్నామని, సుమారు 208 కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.20 కోట్ల పై విలువ గల 4,100 కేజీల గంజాయిని కోర్టు నుంచి అనుమతి తీసుకుని డిస్పోజ్ చేస్తున్నామన్నారు. దీని ద్వారా గంజాయి రవాణా, వినియోగించే వారికి గట్టి హెచ్చరిక పంపినట్లవుతుందన్నారు. తిరుపతి పట్టణం బెంగళూరు, చెన్నైకి ఒక ట్రాన్సిట్ పాయింట్‌గా గంజాయి రవాణాలో గుర్తించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాకు ఎక్కువగా ఏఎస్ఆర్ జిల్లా నుంచి వైజాగ్, కాకినాడ మీదుగా బస్సుల్లో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో తిరుపతికి వచ్చి, ఇక్కడి నుంచి చెన్నై, బెంగళూరు మరియు కేరళకు వెళ్లడం గమనించామన్నారు. వాటిని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సెర్చ్ పార్టీలను పెట్టి ట్రైన్స్, బస్సులు, లగేజీలను పరిశీలించి చేసి సీజ్ చేయడం జరిగిందన్నారు. పట్టుబడిన గంజాయిని సీజ్ చేయడంతో పాటు లక్ష మంది స్కూల్ మరియు కాలేజ్ 8, 9, 10 మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులను ఒకే వేదికపైకి తెచ్చి, ఆన్లైన్ ద్వారా గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాల మీద అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఒక వైపు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో వైపు పిడి యాక్ట్ కింద కేసులు పెడుతూ గంజాయి వాడకాన్ని నియంత్రిస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో సుమారు 15 పీడీ కేసులు (ప్రివెంటివ్ డిటెన్షన్) పెట్టడం జరిగిందన్నారు. గంజాయి మరియు ఇతర డ్రగ్స్ మీద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం, భవిష్యత్తులో ఎవరైనా గంజాయి రవాణా చేసినా, నిల్వ చేసినా, సహకరించినా లేదా వినియోగించినా వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు

జిల్లాలో గత మూడు సంవత్సరాల నుండి సీజ్ చేసిన సుమారు 4 వేల కేజీల గంజాయి కోర్టు అనుమతితో డిస్పోజ్ చేస్తున్నామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం అరికట్టడంలో పోలీస్ శాఖ ఎటువంటి అలసత్వం వహించదు. ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా గంజాయి, మత్తు పదార్థాల వాడకం దుష్ప్రభావం, ఆరోగ్య సమస్యల ను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారి పై పి డి యాక్ట్ కింద అరెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. వివిధ విద్యా సంస్థలు, ఎన్జీవోలు, పోలీస్ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. తిరుపతి ఒక ఆధ్యాత్మిక నగరం, ఎటువంటి గంజాయికి స్థానం లేదని ఆ దిశగా ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పని చేయడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ప్రజల్లో మరింత పూర్తిగా అవగాహన కల్పించి, లీగల్ ప్రొసీజర్ ప్రకారం వెళ్తూ గజాయిని పూర్తిగా రూపుమాపడానికి చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తులో గంజాయి, మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలు, మీడియా అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రవి మనోహరాచారి డిఎస్పి లు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్ట్.




తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్,ఏప్రిల్ 17. ఈనెల 15న తిరుపతి రూరల్ మండలం దుగ్గసముద్రం పంచాయతీ, అడపా రెడ్డి పల్లెలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు తిరుపతి రూరల్ పోలీసులు. ఈ సందర్భంగా తిరుపతి రూరల్ డిఎస్పి మాట్లాడుతూ..... అమర్నాథ్ రెడ్డి కుటుంబం రాహుల్ రెడ్డి కుటుంబాల మధ్య కొన్ని సంవత్సరాలుగా ఓ స్థలం విషయమై గొడవలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఆ స్థల విషయమై కోర్టులో విచారణ జరుగుతుందన్నారు. అయితే గతంలో రాహుల్ రెడ్డి పై అమర్నాద రెడ్డి చేయి చేసుకోవడంతో రాహుల్ రెడ్డి కక్షపెంచుకున్నాడు. అమర్నాథరెడ్డిని హత్య చేయాలని పూనుకున్నాడు నిందితుడు. ఈనెల 15న మృతుడు తన ఇంటిపై క్రికెట్ చూస్తుండగా ఒక్కసారిగా రాహుల్ రెడ్డి కత్తితో దాడి చేసి గొంతు చేసి హత్య చేశాడని తెలిపారు.

ఈ విషయమై మృతుడు బంధువులు ఫిర్యాదు చేయడంతో హత్య నేరం కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. తిరుపతి రూరల్ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో ఎస్సై లోకేష్,హత్య నేరానికి ఉపయోగించిన కత్తిని నిందితుడుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు డి.ఎస్.పి బేతంపూడి ప్రసాద్ తెలిపారు.

# సంఘీక సంక్షేమలో విరబూసిన విద్యా కుసుమాలు..




నెల్లూరు పెన్ పవర్ ఏప్రిల్ 17: శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయములోని తిక్కన ప్రాంగణము లో సంఘీక సంక్షేమ కాలేజి హాస్టల్ లో ఉంటూ ఉంటూ మొదటి, రెండవ సంవత్సరము ఇంటర్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణ సాదించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రసంశా పత్రాలను అందించారు. వారిలో ఆత్మకూరు బాయిస్ హాస్టల్లో ఇంటర్ ప్రదమ సంవత్సరములో (479/500) మార్కులు సాధించిన కే.గణేష్, (473/500) మార్కులు సాధించిన పి.పూజ,నెల్లూరు, మరియు బి.పుష్పలత ( 468/500) , ద్వితీయ సంవత్సరములో యన్. అనూషా(956/1000)టి.సుమతి(934/1000),పి.శ్రీ వేణు (924/1000) లను సముచిత రీతిలో ప్రసంశా పత్రంతో సముచిత రీతిలో సత్కరించారు

# మహిళా బిల్లుతో నవశకానికి నాంది

## ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు నిర్ణయం చారిత్రాత్మకం ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ


నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 17 మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం దిశగా అడుగులు పడటం దేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ పేర్కొన్నారు.ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆమె 2 వ రోజు పార్లమెంట్ పరిణామాలపై స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ మహిళలు సమాజంలో 50 శాతం ఉన్నప్పటికీ,చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం విచారకరం అన్నారు.ఈ అంతరాన్ని తొలగించి,మహిళా సాధికారతకు బాటలు వేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం అని పేర్కొన్నారు.ఈ చారిత్రక నిర్ణయానికి తాను పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.తెలుగుదేశం పార్టీ మొదటి నుండి మహిళా పక్షపాతి అని గుర్తు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ బిల్లుకు అన్ని పార్టీల మద్దతు కూడగట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె కొనియాడారు.మహిళల అభ్యున్నతి కోసం ఇప్పటికే సీఎం అనేక లేఖలు రాశారని,వారి సాధికారతే నిజమైన సమాజ పురోగతికి మూలమని ఆమె స్పష్టం చేశారు.ఢిల్లీలో సాగుతున్న ఈ చర్చలు సఫలీకృతమై, బిల్లు త్వరలోనే చట్టంగా మారుతుందనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు.



# మహిళా రిజర్వేషన్ బిల్లు ఒక చారిత్రక అడుగు

## మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వడ్డే అనురాధ

కావలి ఆర్ సి ఇంచార్జి పెన్ పవర్ ఏప్రిల్ 17 మహిళా రిజర్వేషన్ బిల్లు ఒక చారిత్రక అడుగు అని, చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల అమలు కోసం పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోద పొందడం హర్షణయం అని జలదంకి మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు వడ్డే అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మహిళల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. ఈ బిల్లు ద్వారా దేశంలోని చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం లభిస్తుందని, తద్వారా వారు దేశాభివృద్ధిలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో భారతదేశాన్ని పాలించిన వీరనారీమణుల చరిత్రను గుర్తు చేస్తూ, మహిళలు అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాలు సుభిక్షంగా ఉండేవని, ప్రస్తుత కాలంలో కూడా రాష్ట్రపతి, ఆర్థిక మంత్రి వంటి కీలక పదవుల్లో మహిళలు తమ సామర్థ్యాన్ని చాటుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించడం మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం హర్షనీయమన్నారు.



# బలహీన పరుస్తున్న డీలిమిటేషన్ బిల్లు




కడప.పెన్ పవర్, ఏప్రిల్ 17, కేంద్రంలోని బిజెపి ఎన్డిఎ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన 131వ రాజ్యాంగ సవరణ దేశ సమైక్య వాదంపై దాడి చేసే విధంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాల ప్రజాస్వామ్య హక్కులను బలహీన పరుస్తున్న డీలిమిటేషన్ బిల్లు జనగణన జరిగిన తర్వాతనే పెట్టాలని తెలిపారు. మహిళా రిజర్వేషన్ పేరిట డీలిమిటేషన్ బిల్లు రాజకీయమయోపాయంగా ప్రవేశపెట్టాలని దీని దేశ ప్రజలందరూ తిప్పి కొట్టాలన్నారు. గతంలో మండల కమిషన్, సచార్ కమిషన్, రంగనాథ కమిషన్ దేశంలోని ప్రజల వాస్తవ స్థితిగతులపై సిఫారసులు కేంద్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఇచ్చారని, వాటిలో ఏ ఒక్క సిఫారసుకూడా పరిగణలోకి కేంద్రలో కొలువుతీరిన బిజెపి, ఎన్డిఎ ప్రభుత్వం తీసుకోవడం లేదని విమర్శించారు. డీ-లిమిటేషన్ బిల్లుతో సంబంధం లేకుండానే 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు 2023 లోనే 106వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు ఆమోదం పొందిందని గుర్తు చేశారు. దానిని 2029 లో జరగబోయే 19వ సార్వత్రిక ఎన్నికల్లో అమలు చేయాలని వారు కోరారు. 2026-2027 జనగణన పూర్తయ్యాక నియోజకవర్గం బిల్లు ప్రవేశపెట్టాలని అప్పుడు మాత్రమే అది శాస్త్రీయ పద్ధతిలో ఉంటుందని తెలిపారు. లేకుంటే దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యం చట్టసభల్లో ప్రస్ఫుటి స్తుందని, ఇది రాజకీయ, సామాజిక న్యాయానికి పూర్తి విరుద్ధమని, రాజ్యాంగ నిర్మాతలు కోరుకున్న విధానానికి భిన్నమైనదని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

# భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా

## గంటావూరు శ్రీతిరుపతి గంగమ్మ



పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 17, భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గంటావూరు శ్రీతిరుపతి గంగమ్మతల్లి అని ఆలయ చైర్మన్,డాక్టర్ మురుగన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీ గంటావూరు నందు వెలిసిన శ్రీతిరుపతి గంగమ్మ ఆలయంలో ప్రతి అమావాస్య లాగే శుక్రవారం అమావాస్య సందర్భంగా శ్రీతిరుపతి గంగమ్మ, మారెమ్మ ఇరువురు అమ్మవార్లకు ఫల, పంచామృతాలతో సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు.ఆలయ చైర్మన్ మురుగన్,శ్వేతా దంపతుల చేతుల మీదుగా అమ్మవార్లకు పూజాదికాలు నిర్వహించి,అనంతరం అత్యంత శోభాయమానంగా అలంకరించిన అమ్మవారికి మాంగళ్య దారణతో ఊంజల్ సేవ నిర్వహించారు.ఈ సందర్భంగా పాల్గొన్న వేలాదిమంది భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మురుగన్ పర్యవేక్షణలో జరిగింది. అటు పిమ్మట ఆలయ అర్చకులు లలిత్ రామ్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు.భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి తమమ్రొక్కులు తీర్చుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ప్రజలకు చేరువుగా పాలన అందించాలన్నదే లక్ష్యం

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్







కావలి ఆర్ సి ఇంచార్జి పెన్ పవర్ ఏప్రిల్ 17 ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ప్రజా దర్బార్ ను నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరులోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారంఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత సమీపంగా పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ ( పి జి ఆర్ ఎస్-- ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినిపించి, వాటికి తక్షణ పరిష్కారం చూపించే దిశగా ఒక సమగ్ర వేదికగా నిలిచింది. ప్రజాదర్బార్ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించారు. వివిధ శాఖల సమన్వయంతో సమస్యల పరిష్కారం వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాలకు చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కు అందించారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన ధ్యేయం" అని పేర్కొంటూ, ప్రతి అధికారి బాధ్యతతో, పారదర్శకంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తేనే ప్రజల సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, నాలుగు మండలాల ప్రజలు పాల్గొన్నారు

# పలమనేరులో హోరెత్తిన బుల్లెట్ ట్రైన్ సాధన గళం

## భారీర్యాలీ చేపట్టిన పలమనేరు పరిరక్షణ సమితి.




పలమనేరు,పెన్ పవర్, ఏప్రిల్ 17, పలమనేరు అభివృద్ధిని కాంక్షిస్తూ చెన్నై-బెంగళూరు బుల్లెట్ ట్రైన్ స్టాప్ సాధన కోసం పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల పక్ష భారీ ర్యాలీ జనసంద్రమై హోరెత్తింది. పట్టణంలోని మిట్టపైన గల ఎన్జీఓ హోమ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ జవిలి వీధి, బజార్ వీధి, గంగమ్మ గుడి వీధి మీదుగా శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ వరకు సాగింది. అనంతరం నెహ్రూ సర్కిల్ వద్ద భారీ మానవహారం నిర్వహించి ప్రజలు తమ ఆకాంక్షను, ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా పి.పి.ఎస్ అధ్యక్షుడు టి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ..బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో పలమనేరును విస్మరించడం ఈ ప్రాంత ప్రజలకు చేసే తీరని అన్యాయమని మండిపడ్డారు.రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పలమనేరులో స్టాప్ ఇవ్వడం అన్ని విధాలా సమంజసమని,కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఇక్కడ స్టేషన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.జనరల్ సెక్రటరీ నారాయణ మాట్లాడుతూ.. పలమనేరు చుట్టుపక్కల వందలాది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నారని, బుల్లెట్ ట్రైన్ స్టాప్ వల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా, ఆర్థికంగా ఊపందుకుంటుందని అన్నారు.ఇది కేవలం ఒక స్టేషన్ కోసం చేస్తున్న పోరాటం కాదని, మన బిడ్డల భవిష్యత్తు కోసం చేస్తున్న యుద్ధమని పేర్కొన్నారు.ఈ భారీ ర్యాలీలో మధు కాలేజ్ అధినేత కృష్ణమూర్తి రెడ్డి,సాయి శ్రీచైతన్య కాలేజ్, వెంకట రమణారెడ్డి పాల్గొని విద్యార్థి లోకానికి దిశా నిర్దేశం చేశారు.వివిధ కళాశాలల యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, గృహిణులు, మహిళలు,వివిధ కుల సంఘాలు, వర్గాల వారు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలిపారు. వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా పాల్గొని సంఘీభావం ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో విజయకుమార్ రెడ్డి, రామచంద్ర,రాఘవయ్య,సన్నీరాజు,పొన్ముడి, వీరభద్రగౌడు,రెడ్డెప్ప నాయుడు,సురేంద్ర, వెంకట్,సుభాన్, రెడ్డివారి గిరీష్,విజయ్ కుమార్,శ్రీపురం సీతారామయ్య తదితర ప్రముఖులతో పాటు అన్ని కుల,మత సంఘాల నాయకులు, ఎన్జీఓలు మరియు మీడియా ప్రతినిధులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. పలమనేరు ఐక్యతను చాటిన ఈ ర్యాలీ, ప్రభుత్వాల కళ్ళు తెరిపిస్తుందని పిపిఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

# రైతులు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి-తహసిల్దార్ యువరాజు







నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 17 నాయుడుపేట మండలంలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న ఈ సర్వే ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట మండల తహసిల్దార్ యువరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గొట్టుప్రోలు గ్రామ పంచాయితీలో శనివారం నుండి రీ సర్వే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.రైతులు రీ సర్వే అధికారులకు అందుబాటులో ఉండాలని సూచించారు.రీ సర్వే జరుగుతున్న సమయంలో రైతులు వారి వారి పొలాల వద్ద ఉండి హద్దులు చూపించాలని తెలియజేశారు.రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వం ఉచితంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు.రైతులు రీ సర్వే అధికారులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యులు పల్లమాల రామిరెడ్డి, గొట్టిప్రోలు మాజీ సర్పంచ్ కె తిరుపాలు, గ్రామ రైతులు రఘురామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,గుండాల చిన్నయ్య, వెంకయ్య, పిట్ల శ్రీరాములు, కొణిజేటి శ్రీనివాసులు,బందిలి కస్తూరయ్య, వీఆర్వో వెంకయ్య మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

# నాయుడుపేట ఎల్ ఏ సాగరం హై స్కూల్లో మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆకస్మిక తనిఖీ చేసిన విద్యా కమిటీ చైర్మన్ నెలవల చంద్రశేఖర్

## విద్యార్థులతో కింద కూర్చుని భోజనం చేసి. విద్యార్థుల అభిప్రాయాలు సేకరించిన విద్యా కమిటీ చైర్మన్ నెలవల చంద్రశేఖర్, హెచ్ఎం డాక్టర్ కట్టిన సుబ్రమణ్యం

నాయుడుపేట, పెన్ పవర్, ఏప్రిల్ 17 కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నాయుడుపేట , ఎల్.ఏ. సాగరం లోని హైస్కూల్‌లో నేడు స్కూల్ విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించడానికి స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ నెలవల చంద్రశేఖర్ మరియు ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కట్టిన సుబ్రమణ్యం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.తనిఖీలో భాగంగా వారు కేవలం వంటశాలను పరిశీలించడమే కాకుండా, విద్యార్థులతో కలిసి భోజన హాల్లో కింద కూర్చుని మధ్యాహ్న భోజనాన్ని భుజించారు. విద్యార్థులకు పెడుతున్న అన్నం, కూర, సాంబారు నాణ్యతను స్వయంగా రుచి చూశారు. భోజనం రుచి, శుభ్రత గురించి వారు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా హెచ్ఎం సుబ్రమణ్యం మరియు చైర్మన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యమే మాకు ముఖ్యమని, భోజనం తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని వంట ఏజెన్సీ సిబ్బందిని హెచ్చరించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం, నాణ్యమైన మరియు రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, పరిశుభ్రతను పాటించాలని వారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



# సమాజ అభివృద్ధి చెందాలంటే విద్య కీలకం.

## --గల్లా గ్రూప్స్ చైర్మన్ రామచంద్ర నాయుడు.



తిరుపతి క్రైమ్ బ్యూరో,పెన్ పవర్, ఏప్రిల్ 17. దేశం అభివృద్ధి చెందాలంటే విద్య ఎంతో కీలకమని కొనియాడారు గల్లా గ్రూప్స్ చైర్మన్ రామచంద్ర నాయుడు.రేణిగుంట మండలం కరకంబాడిలోని అమర రాజా విద్యాలయంలో 30వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. "సమగ్రత -- ఒక దృష్టి, ఒక హృదయం, ఒక లక్ష్యం" అనే ప్రధాన థీమ్‌తో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గారు మాట్లాడుతూ....... గల్లా రామచంద్ర నాయుడు గారు మన జిల్లా లో అమర రాజా సంస్థలను స్థాపించి దాదాపు 40 సంవత్సరాలుగా దేశ విదేశాలకు సేవలందిస్తున్నారు, అదేవిధంగా అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నారు, విద్యారంగంలో అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు, ఈ విద్యా సంస్థలు ద్వారా వేలమంది నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు, విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాల పరిమితిలో నిలిచిపోకుండా, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సమగ్ర ప్రక్రియగా మారాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించాలంటే నైతిక విలువలు, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలను అలవర్చుకోవడం అత్యవసరమని సూచించారు.ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు గారు మాట్లాడుతూ.... విద్యార్థులు భవిష్యత్తు నాయకులని, వారికి జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, బాధ్యత, సేవాభావం కూడా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే వేదికలుగా మారాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. గౌరవ అతిథి అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరినేని గారు మాట్లాడుతూ..... విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధేశించుకుని క్రమబద్ధంగా కృషి చేస్తే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించగలరని అన్నారు. ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని, శారీరక--మానసిక దృఢత్వం ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు.అమర రాజా గ్రూప్ సప్లై చైన్ ప్రెసిడెంట్ ఎల్. వెంకట్ మాధవ్ గారు మాట్లాడుతూ..... సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విజయానికి మూడు కీలక సూత్రాలని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఈ విలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా అగ్రగాములుగా నిలుస్తారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సంగీత ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అమర రాజా గ్రూప్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ నళిని కుమార్ గారు, రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ గారు, ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవప్రియ గారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సమాజ అభివృద్ధి చెందాలంటే విద్య కీలకం.
--గల్లా గ్రూప్స్ చైర్మన్ రామచంద్ర నాయుడు.



తిరుపతి క్రైమ్ బ్యూరో,పెన్ పవర్, ఏప్రిల్ 17. దేశం అభివృద్ధి చెందాలంటే విద్య ఎంతో కీలకమని కొనియాడారు గల్లా గ్రూప్స్ చైర్మన్ రామచంద్ర నాయుడు.రేణిగుంట మండలం కరకంబాడిలోని అమర రాజా విద్యాలయంలో 30వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. "సమగ్రత -- ఒక దృష్టి, ఒక హృదయం, ఒక లక్ష్యం" అనే ప్రధాన థీమ్‌తో ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గారు మాట్లాడుతూ....... గల్లా రామచంద్ర నాయుడు గారు మన జిల్లా లో అమర రాజా సంస్థలను స్థాపించి దాదాపు 40 సంవత్సరాలుగా దేశ విదేశాలకు సేవలందిస్తున్నారు, అదేవిధంగా అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నారు, విద్యారంగంలో అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు, ఈ విద్యా సంస్థలు ద్వారా వేలమంది నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు, విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాల పరిమితిలో నిలిచిపోకుండా, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సమగ్ర ప్రక్రియగా మారాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించాలంటే నైతిక విలువలు, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వంటి లక్షణాలను అలవర్చుకోవడం అత్యవసరమని సూచించారు.ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు గారు మాట్లాడుతూ.... విద్యార్థులు భవిష్యత్తు నాయకులని, వారికి జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, బాధ్యత, సేవాభావం కూడా బోధించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థలు విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే వేదికలుగా మారాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. గౌరవ అతిథి అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమాదేవి గౌరినేని గారు మాట్లాడుతూ..... విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధేశించుకుని క్రమబద్ధంగా కృషి చేస్తే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించగలరని అన్నారు. ఆరోగ్యం, విద్య రెండూ సమానంగా ముఖ్యమని, శారీరక--మానసిక దృఢత్వం ఉన్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని సూచించారు.అమర రాజా గ్రూప్ సప్లై చైన్ ప్రెసిడెంట్ ఎల్. వెంకట్ మాధవ్ గారు మాట్లాడుతూ..... సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విజయానికి మూడు కీలక సూత్రాలని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఈ విలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా అగ్రగాములుగా నిలుస్తారని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సంగీత ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో అమర రాజా గ్రూప్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ నళిని కుమార్ గారు, రాజన్న ఫౌండేషన్ హెడ్ రాళ్లపల్లి సతీష్ గారు, ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవప్రియ గారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీసీ కెమెరాల నిఘాలో దామరమడుగు

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 17. దామరమడుగు గ్రామంలో ఒక్కసారిగా 20 సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాలు చేసే వారికి భయం కలిగించింది అదే గ్రామానికి చెందిన కొండా చంద్రమోహన్ రెడ్డి సీసీ కెమెరాలు ఏర్పాటుకు జాతక వ్యవహరించారు గ్రామం పెద్దది కావడం తరచూ తగాదాలు నేరాలు జరుగుతుండడంతో స్థానికుల కోరిక మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన కొండ చంద్రమోహన్ రెడ్డి సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించారని ఆ గ్రామానికి చెందిన కే వెంకట శేషయ్య తెలిపారు స్థానికంగా హై స్కూలు జూనియర్ కళాశాల ఉండడం ఆకతాయిల బెడద నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించేందుకు ఈ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం సిఐ ఎం శ్రీనివాసరావు ఎస్ఐ సంతోష్ రెడ్డి రూరల్ అధ్యక్షుడు బెజవాడ జగదీష్





కె.వి శేషయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు

# జన్మదిన వేడుకలకు సర్వం సిద్ధం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి...





ఆత్మకూరు పెన్ పవర్ ఏప్రిల్ 17. తన నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈనెల 20వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆత్మకూరులో ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సన్నహాలు చేస్తూ ఉండగా అక్కడ ఏర్పాట్లను నేడు మంత్రి ఆనం పరిశీలించారు.. మార్కెటింగ్ కమిటీ సమీపంలో ఉండే ప్రాంగణంలో భారీ సెట్టింగ్ లతో ఆలయ గోపురం నిర్మిస్తున్నారు. ఇక్కడే హోమ కార్యక్రమాలు కూడా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ చేపట్టిన ఆలయ గోపురం పనులు ఇతర నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి తమ పార్టీ నేతలకు పలు సూచనలు చేశారు.. అనంతరం పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 20వ తేదీన ముఖ్యమంత్రి జన్మదిన సందర్భంగా ఇక్కడ చేపట్టనున్న పలు కార్యక్రమాలకు సంబంధించి దిశా నిర్దేశ చేస్తూ ఆ రోజు నిర్వహించే కార్యక్రమానికి అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి.పావని, డిఎస్పి కే వేణుగోపాల్ కూటమి నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..

# మేధస్సుకు పదును..ప్రతిభకు పురస్కారం.

## --ఒలింపియాడ్ బహుమతుల ప్రధానోత్సవం.

## --విద్యార్థిని బొడగల చార్వి కి ల్యాబ్ టాప్ అందజేత.



తిరుపతి,పెన్ పవర్, ఏప్రిల్ 17. స్థానిక ఇందిరానగర్ శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల ప్రతిభకు పట్టాభిషేకం జరిగింది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ నైపుణ్య ఒలింపియాడ్ పరీక్షల్లో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం ఘనంగా బహుమతులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి తిరుపతి మండల విద్యాశాఖ అధికారి కే బాలాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలను అభినందించారు.

మేధస్సు కు పదును.. ప్రతిభకు పురస్కారం.. ఏజీఎం సురేష్

పాఠశాల ఏజీఎం సురేష్ మాట్లాడుతూ ఈ ఒలింపియాడ్ పరీక్షల ద్వారా విద్యార్థులు తమలోని ఆలోచన శక్తి సమస్య పరిష్కారల నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీయాలి... ఎంఈఓ బాలాజీ

ఈ సందర్భంగా ఎంఈఓ బాలాజీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కేవలం అకాడమిక్ పాఠశాలకే పరిమితం కాకుండా ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షల ద్వారా తమ మేధాశక్తిని పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఇలాంటి జాతీయస్థాయి వేదికలపై పోటీ పడడం ద్వారా భవిష్యత్తులో ఐఐటి సిట్ వంటి పోటీ పరీక్షలను సులభంగా ఎదుర్కోగలరని తెలిపారు.

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలి..ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 3వ తరగతి నుండి 10 వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే అవకాశాన్ని పొందుతారని ఆయన తెలిపారు.

అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ల్యాబ్ టాప్ లు ట్యాబ్ లు,స్మార్ట్ వాచీలు మరియు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం సురేష్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు వైస్ ప్రిన్సిపల్ కీర్తి కోఆర్డినేటర్ బాలాజీ జోనల్ ఇంచార్జ్ లావణ్య డీన్ కాశీ రావు సిబిఎస్ఇ ఇంచార్జ్ త్రీలో ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన నగర కమిషనర్ కే. మయూర్ అశోక్..







గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 17,నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన నగర కమిషనర్ కే. మయూర్ అశోక్. శుక్రవారం జీఎంసి ప్రధాన కార్యాలయంలోని పార్కింగ్ వద్ద చలివెంద్రాన్ని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సందర్శకులు, పన్ను చెల్లించడానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేలా ప్రస్తుతం ఉన్న రెండు ఆర్.ఓ ప్లాంట్లకు అదనంగా చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ క్రింద గుంటూరు నగరంలో జనసాంద్రత అధికంగాఉండే ప్రాంతాలలో మరియు నగరంలోని ప్రధాన కూడళ్ళలో చలివెంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నగరంలోని వివిధ ప్రాంతాలలో 14 చలివెంద్రాలను ఏర్పాటు చేయుట జరిగిందని, ఇంకా30 ప్రాంతాలలోచలివెంద్రాలను ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యస్.ఈ జి. వెంకటేశ్వర రావు, ఈ. ఈ లు, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పేద కూలి అగ్నికి ఆహుతి ...



పెళ్లకూరు,పెన్ పవర్,ఏప్రిల్ 17 మండల పరిధిలోని తాల్వాయిపాడు గ్రామానికి చెందిన బండి వెంకటరమణయ్య(65) ప్రమాదవశాత్తు మంటలలో చిక్కుకొని మృతి వివరాల్లోకి వెళ్ళగా ప్రతినిత్యం కూలి పనికి వెళ్లే వెంకటరమణయ్య,, భార్య లక్ష్మమ్మ నిరుపేద కుటుంబీకులైనందువల్ల కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు శుక్రవారం వెంకటాచలపతి పొలం వద్దకు ఇద్దరు కలిసి వెళ్లారు, పొలాలలో కూసంత దూరములో సౌక తోటలో మంటలు చూసి మంటలు ఎక్కువ క్రమంలో మంటలు ఆర్పే ప్రయత్నంలో చెరో వైపు వెళ్లారు, వెంకటా చలపతి ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పుకుంటు వచ్చే క్రమంలో యువతల వైపు వెంకటరమణయ్య మంటల్లో మృతుడై కనిపించాడు, సమాచారం తెలుసుకున్న పెళ్లకూరు పోలీసు వారు సంఘటనా స్థలం చేరుకొని పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది వెంకట రమణయ్య భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలియజేశారు.

# ప్రజాదర్బార్ లో ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటా..ఎమ్మెల్యే నసీర్





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 17, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని, ఇది తనకు దక్కిన అదృష్టంగా భావిస్న్?న్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అయ్యా రేషన్ కార్డు ఇచ్చారు.. అందులో పేర్లు తప్పులుగా వచ్చాయి. సరి చేయించండి అంటూ ఒకరు.. పింఛన్ కోసం ఎన్నో రోజులుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పింఛన్ ఇప్పించండయ్యా అంటూ మరొకరు.. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు.. కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదు అంటూ ఇంకొకరు ఎమ్మెల్యే నసీర్ కు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై మొత్తం 164 అర్జీలు దాఖలు కాగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఇలా ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని తెలిపారు. దీంతో ప్రజాదర్బార్ లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే కడుపు నిండా ఆహారం పెట్టే గొప్ప పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అగ్గిపెట్టెలులాంటి సెంటు భూమి ఇచ్చి నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారని వివరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం 18 నెలల కాలంలోనే మెగా జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. ఏ సమస్య వచ్చినా గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగాలి..మహిళల ప్రత్యేక పూజలు.





గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 17, తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఉ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాను సారం బృందావన గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో ప్రార్థనలులి తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఉ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశానుసారం, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆమోదం పొందాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ తెలుగు మహిళలు బృందావన గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ..మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు ఒక చారిత్రాత్మక నిర్ణయం అని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా మహిళలకు రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుందని, వారి స్వరానికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ఇది మహిళల రాజకీయ హక్కులను పరిరక్షించడమే కాకుండా సమానత్వానికి దారి తీసే కీలక అడుగు అని అభిప్రాయపడ్డారు. మహిళలు అధికారంలో భాగస్వామ్యమైతే ఆరోగ్యం, విద్య, భద్రత, కుటుంబ సంక్షేమం వంటి అంశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. మహిళల పాలనలో పారదర్శకత పెరిగి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ఈ బిల్లు ద్వారా సమాజంలో సమతుల్యత పెరిగి మహిళా సాధికారత మరింత బలపడుతుందని పేర్కొన్నారు. 1996లోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ఎన్నో ఏళ్ల తర్వాత ఆమోద దశకు చేరుకోవడం ఆనందకరమని పేర్కొంటూ, ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కి కృతజ్ఞతలు తెలిపారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారతకు పునాది వేసిన నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి హక్కుల్లో సమానత్వం కల్పించారని గుర్తు చేశారు. అనంతరం నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించారని, నారా లోకేష్ గారు మహిళా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మహిళలకు గౌరవం, భద్రత, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించాయని పేర్కొన్నారు. స్త్రీ శక్తి, దీపం, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా మహిళలను ప్రోత్సహించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ముత్తినేని శివలీల, పంచుమర్తి కల్పన, నంది సరస్వతి, చెంబేటి మణికుమారీ, మానం పద్మ శ్రీ, షేక్ కరిమూన్ , లక్ష్మీ ప్రసన్న, నాగూరా,గుర్రంమల్లీశ్వరి,కడియాల శ్రీదేవి,కోటేశ్వరమ్మ, వకుళా దేవి, బాల కోటమ్మ, శోభా రాణి,రామ లక్ష్మీ, సీత, దర్శనపు విజయమ్మ,శివ జ్యోతి, పేరం అనిత, నాగరాణి, జయలక్ష్మి, నాగ లక్ష్మీ,మీనాక్షి, కామాక్షి,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు : ఎస్పి




కడప పెన్ పవర్, ఏప్రిల్, 17: జిల్లాలో అక్రమంగా మద్యం విక్రయించే బెల్ట్ షాపులపై విస్తృతంగా దాడులు చేసి పట్టు బడ్డ వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జమ్మలమడుగు సబ్ డివిజన్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రౌడీయిజం ఎక్కడా ఉండకూడదని, రౌడీల ఆట కట్టించి శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవనే హెచ్చరిక ప్రజల్లోకి వెళ్లాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా గంజాయి లేకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసే వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. 'శక్తి' టీముల డే బీట్స్ పర్యవేక్షిస్తూ స్కూళ్ళు, కాలేజీలు, ఆఫీస్ లు, వ్యాపార సముదాయాల వద్ద, రద్దీ ప్రాంతాలలో తప్పనిసరిగా పోలీస్ సిబ్బంది బీట్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్కూళ్ళు, కాలేజీలలో మహిళా భద్రతపై, సోషల్ మీడియా వల్ల కలిగే మహిళలు, బాలికల వేధింపులపై అవగాహన కల్పించాలన్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లు, గతంలో నేరాలకు పాల్పడిన వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గ్రామ సభలు, పల్లె నిద్ర, గ్రామాల సందర్శన తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

# నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి జన్మదినం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం

నెల్లూరు రూరల్ పెన్ పవర్, ఏప్రిల్, 17, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలో నెల్లూరు అభివృద్ధి ప్రదాత, సేవా తత్పరుడు, ప్రియతమ నేత నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈనెల 19న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో షైన్ డెంటల్ హాస్పిటల్ , పొగతోట ఎంవారి సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం జరుగును

# మెగాభిమానుల , జనసైనికుల సహనానికి ఒక హద్దు ఉంటుంది అది దాటితే..జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి..

గుంటూరు, పెన్ పవర్, ఏప్రిల్, 17, జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ప్రఖ్యాత నటులు రామ్ చరణ్ , నిహారికల వ్యక్తిగత జీవితాలను స్టాండప్ కామెడీ పేరిట కించపరుస్తూ కటికాల అనుదీప్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తూ అతనిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ను అయన కార్యాలయంలో జిల్లా జనసేన అధికార ప్రాతినిది ఆళ్ళ హరి కలిసి ఫిర్యాదు చేశారు కోరారు. ఈ సందర్భంగా అనుదీప్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆళ్ళ హరి ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్పీ స్పందిస్తూ అనుదీప్ చేసిన వ్యాఖ్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సానుకూలంగా స్పందించ్చారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ ప్రముఖుల , రాజకీయ నాయకుల , సినీ నటుల జీవితాల్లోకి తొంగిచుస్తూ వారి వ్యక్తిత్వాన్ని హననం చేయటం కొంతమందికి ఒక ఫ్యాషన్ గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హణనానికి పాల్పడితే ఎంతటి వారినైనా సహించేది లేదన్నారు. ఈ విష సంస్కృతిని ఎప్పటికప్పుడు నివారించకపోతే సమాజంలో అలజడులు మొదలయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసారు. స్టాండప్ కామెడీ అంటే నవ్వించాలి కానీ కొందరి జీవితాలను ఏడిపించటం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడి వారి గౌరవాన్ని అవమానించటాన్ని సామాజిక నేరంగా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సమాజంలో తమకు గుర్తింపు రావటం కోసం కొంతమంది చీడపురుగులు మెగాఫ్యామిలీ టార్గెట్ గా అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.



మెగాభిమానుల , జనసైనికుల సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని , మరోసారి ఎవరన్నా హద్దు మీరితే పరిస్థితులు మరోలా ఉంటాయాని ఆళ్ళ హరి హెచ్చరించ్చారు. ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో నగర జనసేన కార్యదర్శి షేక్ మెహబూబ్ బాషా , కోలా అంజి , వడ్డె సుబ్బారావు , నందూరి స్వామి తదితరులున్నారు.

# హెల్మెట్ తప్పనిసరి ఎస్సై సోమేశ్వరరావు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 17: చిలకలూరిపేట : వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సోమేశ్వరరావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని కళామందిర్ సెంటర్ వద్ద సిబ్బందితో కలిసి ఆయన ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులపై కేసు నమోదు చేసి, అపరాధ రుసుము విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని డ్రంక్ అండ్ డ్రైవ్, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం (త్రిబుల్ రైడింగ్) చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ 2026 ప్రధానమంత్రి వర్చువల్ ముఖాముఖితో ముగిసిన రెండ్రోజుల జాతీయ సదస్సు..

విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 17, యువతను దేశాభివృద్ధిలో భాగస్వాములను చేసే లక్ష్యంతో ఏప్రిల్ 12 మరియు 13 తేదీలలో నిర్వహించిన మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ 2026 వర్చువల్ కాన్ఫరెన్స్ అత్యంత వైభవంగా ముగిసింది. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఘట్టంగా భారత ప్రధానమంత్రి దేశవ్యాప్త యువతతో వర్చువల్ పద్ధతిలో ముఖాముఖి నిర్వహించి, వారికి దిశానిర్దేశం చేశారు.

ముఖ్య అతిథుల భాగస్వామ్యం

ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో కేంద్ర మరియు రాష్ట్ర స్థాయి ప్రముఖులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు:

మన్సుఖ్ మాండవియా కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి. ఎం. రామ్ ప్రసాద్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ యువజన వ్యవహారాలు మరియు క్రీడల శాఖ మంత్రి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రముఖుల సమక్షంలో.. స్థానిక వేదిక వద్ద ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు మరియు ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ప్రొఫెసర్ కె. గంగాధర రావు వైస్ ఛాన్సలర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ. ప్రొఫెసర్ శివరాం ప్రసాద్‌లి రెక్టర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ. ప్రొఫెసర్ జి. సింహాచలం రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ. ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్.ఎస్. రవి కుమార్ ఓ.ఎస్.డి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ. సుధాకర్ రావు రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్ అధికారి.

కార్యక్రమ విశేషాలు..

ప్రారంభోత్సవం. గౌరవప్రదమైన వందేమాతరం గీతాలాపన, జ్యోతి ప్రజ్వలన మరియు స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలితో సదస్సు ప్రారంభమైంది. మై భారత్ సెషన్.బడ్జెట్ క్వెస్ట్ మరియు వీబీల్డ్ ప్రయాణాన్ని వివరిస్తూ ప్రత్యేక వీడియో ప్రదర్శనలు మరియు ప్రజెంటేషన్లు నిర్వహించారు. ప్యానెల్ చర్చలు.వివిధ



రంగాలకు చెందిన నిపుణులతో రెండు ప్యానెల్ చర్చలు నిర్వహించి, బడ్జెట్ అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. సాంకేతిక నైపుణ్యం ప్రధానమంత్రితో ముఖాముఖి కోసం అత్యాధునిక 1080జూ రిజల్యూషన్ కలిగిన వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థను మరియు నిరంతర ఇంటర్నెట్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

యువతకు సందేశం..

ఈ సందర్భంగా పాల్గొన్న ప్రతి యువకుడికి మై భారత్ టీ-షర్ట్, క్యాప్ మరియు బడ్జెట్ క్వెస్ట్ బ్రాండింగ్ కిట్‌లను పంపిణీ చేశారు. దేశ నిర్మాణంలో యువత పాత్రను గుర్తిస్తూ, వారి ఆలోచనలను ప్రభుత్వ విధానాలకు అనుసంధానం చేయడమే ఈ మై భారత్ వేదిక యొక్క ముఖ్య ఉద్దేశ్యం..

# పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు వాషింగ్ మిషన్ల పంపిణి



చందర్లపాడు (ఎన్టిఆర్) : భారతదేశంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో పీఎం విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లను పరపతి సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తికొండ రాంబాబు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా 18 మంది లబ్ధిదారులకు వాషింగ్ మిషన్ల పంపిణీ చేశామన్నారు. అంతరించిపోతున్న చేతి వృత్తులను తిరిగి లాభదాయకంగా మార్చాలనే లక్ష్యంతో దేశ ప్రధాని నరేంద్ర మోడి దాదాపు 18 రకాల చేతి వృత్తుల వారికి అతి తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు షేక్ రహీం, జడ్పీహెచ్ హైస్కూల్ చైర్మన్ మార్కపూడి జాన్ కోటయ్య, పోస్ట్ మాన్ అధికారులు అనిల్ కుమార్, శరణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేటి నుంచే కొండపల్లి బొమ్మల పండగ.. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..





విజయవాడ, పెన్ పవర్, ఏప్రిల్, 17, ఈ నెల 18వ తేదీ శనివారం నుంచి మూడు రోజుల పాటు కొండపల్లి బొమ్మల పండగ అత్యంత వైభవంగా జరగనుందని.. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ప్రపంచ వారసత్వం దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే ) సందర్భంగా జిల్లాలో మన ఘన సంస్కృతిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా కొండపల్లి బొమ్మల పండగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు ఉదయం ఆరు గంటలకు హెరిటేజ్ ట్రెక్కింగ్ ఫారెస్ట్ వాక్ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు. ఆపై వరుసగా చేతివృత్తుల మూలాలు, బొమ్మలు, 400 సం. చరిత్రపై చర్చ, లైవ్ లో బొమ్మలు చెక్కే ప్రదర్శన, రంగోలి పోటీలు, గ్రామ వీధుల సుందరీకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు - కవి సమ్మేళనం, కీలు బొమ్మలు, తోలుబొమ్మల ప్రదర్శన ఉంటుందని వివరించారు. రెండో రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు బొమ్మల దర్బార్-బొమ్మల ప్రదర్శన ఒ బొమ్మల కొలువు ఉంటుందని తెలిపారు. ఆపై కొండపల్లి బొమ్మల ఉత్పత్తి, కళాకారులకు తెల్లపొనిక చెట్టు వనరులను అందించడం-పాలసీ దృక్కోణంపై చర్చ, విమెన్ ఫ్రం బ్యాక్ రూమ్స్ టు బోర్డు రూమ్స్ పై చర్చ, కొండపల్లి కార్నివాల్, జానపద ప్రదర్శనలు, కళాకారుల ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, కీలు బొమ్మలు, తోలు బొమ్మల ప్రదర్శన ఉంటాయని వివరించారు. మూడో రోజు ఈ నెల 20న ఉదయం 11 గం.లకు మార్కెటింగ్, వ్యాపార అవకాశాలపై చర్చ ఉంటుందని తెలిపారు. ఆపై మధ్యాహ్నం 3.30 గంటలకు ఆటవిడుపుగా రోప్ పుల్లింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ ఒ స్పూన్, బొమ్మల ప్రేరణతో పిల్లల ఫ్యాషన్ షో ఒ పవర్ విమెన్ ఆఫ్ కొండపల్లి, పిండివంటల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని.. చివరగా విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమంతో పాటు ముగింపు వేడుక ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రజాప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొంటారని.. ప్రతిఒక్కరూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు..

# ప్రపంచ స్థాయి విద్యే లక్ష్యం : కలెక్టర్

పెన్ పవర్, ఏప్రిల్, 17: ప్రపంచం లోని టాప్ 100 యూనివర్సిటీల్లో మన జిల్లా విద్యార్థులు సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిని ఆదేశించారు. ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని మన్యం జిల్లా చరిత్ర సృష్టించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విద్యార్థులకు, అధ్యాపకులకు ఘనంగా అభినందన కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ విజయం ప్రభుత్వ విద్యా సంస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని, మన్యం జిల్లా విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీకి సిద్ధం కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నాగేశ్వరరావు సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని కలెక్టర్ కొనియాడుతూ దుస్సాలువలతో ఘనంగా కలెక్టర్ సత్కరించారు. విదేశాల్లో 100శాతం స్కాలర్‌షిప్ పొందే విధానాలను విద్యార్థులకు వివరించి, ప్రోత్సహించాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులందరితో అంతర్జాతీయ స్థాయి పరీక్షలైన ఎస్ఎటి రాయించాలని నిర్దేశించారు. విద్యార్థుల సందేహాలను ఫోన్ ద్వారా నివత్తి చేయడంతో పాటు, యూట్యూబ్ వీడియోలు, కన్సల్టెంట్స్ సమాచారాన్ని వారికి అందుబాటులో ఉంచాలని అన్నారు. విజయకేతనం ఎగురవేసిన మన్యంఇంటర్మీడియట్ ఫస్ట్,




సెకండ్ ఇయర్‌లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం విశేషమన్నారు. రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో ఉన్న జిల్లా కంటే మన్యం జిల్లా 7శాతం అధిక ఉత్తీర్ణత సాధించడం ఇక్కడి విద్యా నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఒక విద్యార్థి 988/1000 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సరంలో 455/470 వరకు అత్యుత్తమ మార్కులు సాధించి విద్యార్థులు రికార్డు సష్టించారని కొనియాడారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు 'భరోసాఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు అధైర్యపడవద్దని, వారికి జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఫెయిల్ అయిన సుమారు 150 మంది విద్యార్థుల పరీక్ష ఫీజును అవసరమైతే భరించి, వారిని సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఓటమి గెలుపునకు సోపానమని విద్యార్థుల్లో మనోధైర్యం నింపారు. గత తప్పుల నుండి నేర్చుకుని ముమ్ముందు రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే తొలిసారిగా 'కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్‌విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ప్రత్యేక కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా సేవలందించడానికి ముందుకు వచ్చిన రాంబాబు, గౌరీ శంకర్, అనంతరాం అనే ముగ్గురు వాలంటీర్లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలోని 14 ప్రభుత్వ కళాశాలల్లో వీరు పర్యటించి, ఇంటర్ తర్వాత కోర్సులు, విద్యా సంస్థలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సేవలు ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. 91 99898 31804, 91 83175 94533, 91 80192 95425 నెంబర్లను హెల్ప్‌లైన్ నంబర్లు సంప్రదించాలన్నారు. ఈ ప్రత్యేక హెల్ప్ డెస్క్ ద్వారా ఇంటర్ తర్వాత ఉన్న ఉన్నత విద్యా అవకాశాలు, వివిధ వత్తి విద్యా కోర్సుల గురించి విద్యార్థులకు నిపుణులచే అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల సందేహాలను నివత్తి చేసేందుకు హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా నిరంతరం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య

చాపాడు, ఆనందపురం : పెన్ పవర్, ఏప్రిల్, 17:ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని ఒక విద్యార్థి, తన స్నేహితుడి కన్నా తక్కువ మార్కులు వచ్చాయన్న మనస్తాపంతో మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డారు. క్షణికావేశానికి లోనై తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చారు. కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన జి.హరిఈశ్వర్ (18) ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అన్ని సబ్జెక్టులూ ఫెయిల్ అయ్యారు. సమీపంలోని ఎర్ర చెరువులో విద్యార్థి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోలీసులు వెలికితీసి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడు ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు.

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బైరిపురం గ్రామానికి చెందిన లోకినిండి తారకరామ్ అలియాస్ సాయి (17) విశాఖ జిల్లా ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ (బైపిసి) చదువుతున్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 441 మార్కులు సాధించినప్పటికీ తన స్నేహితుడి (454 మార్కులు) కన్నా తక్కువ మార్కులు వచ్చాయని తీవ్ర మనస్తాపానికి గురై కళాశాల హాస్టల్ గదితో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## ముంబై ఇండియన్స్ జట్టులో విభేదాలు.. స్టేడియంలోనే హార్దిక్ Vs బుమ్రా మధ్య గొడవ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026లో ఐదు సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ కి ఈ సీజన్ లో ఏది కలిసిరావడం లేదు. గురువారం నాడు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో ముంబై ఘోర పరాజయం పాలైంది. ముంబై ఇండియన్స్ కి ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. ముంబై పాయింట్ల పట్టికలో 8వ రెండో స్థానంలో కొనసాగుతోంది. కాగా వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న ముంబై జట్టులో అంతర్గత విభేదాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా- స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా మధ్య జరిగిన మాటల యుద్ధం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. 196 పరుగుల భారీ లక్ష్య చేధనలో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడుతూ క్రీజులో పాతుకుపోయాడు. అతడ్ని ఔట్ చేసేందుకు హార్దిక్ తీవ్రంగా ప్రయత్నించాడు. అయినప్పటికి ఫలితం మాత్రం లభించలేదు. దీంతో పాండ్యా తన సహనాన్ని కోల్పోయాడు. బుమ్రా బౌలింగ్ చేస్తున్నప్పుడు హార్దిక్ పదే పదే ఫీల్డర్లను మారుస్తూ విసిగించాడు. తన బౌలింగ్ కి తగ్గట్టుగా ఫీల్డింగ్ పెట్టుకునే ఛాన్స్ ఇవ్వకుండా, హార్దిక్ జోక్యం చేసుకోవడం బుమ్రాకు నచ్చలేదు.. హార్దిక్ పాండ్యా చేసిన ఓవరాక్షన్ అతడికి ఏమాత్రం నచ్చలేదు. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది.

బుమ్రా అసహనంతో నీవు నాకు చెప్పొద్దు అన్నట్లు చేసిన సైగలు చేసినప్పటికీ, ఏదేమైనప్పటికి చివరికి కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిర్ణయానికే బుమ్రా తలవంచాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా ఈ ఏడాది ఐపీఎల్ 2026లో బుమ్రా దారుణ ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ భారత పేస్ గుర్రం ఇప్పటి వరకు 5 మ్యాచ్లు ఆడి ఒక్క వికెట్ కూడా తీయలేదు.

## టీ20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం.. కెనడా కెప్టెన్‌పై ఐసీసీ విచారణ!






**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రపంచాన్ని మ్యాచ్ ఫిక్సింగ్ భూతం మరోసారి వణికిస్తోంది. తాజాగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా కెనడా జట్టు ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ విచారణ ప్రారంభించిందని ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో తన కథనంలో వెల్లడించింది.కెనడాకు చెందిన 'ది ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్.. 'కరప్షన్, క్రైమ్ అండ్ క్రికెట్' పేరుతో రూపొందించిన ఒక డాక్యుమెంటరీ ఈ సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో చెన్నై వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్‌పై ప్రధానంగా ఆరోపణలు వెల్లువెత్తాయి.ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలింగ్‌కు దిగిన కెనడా పేసర్లు తొలి రెండు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చారు. మూడో ఓవర్ వేసిన స్పిన్నర్ సాద్ బిన్ జాఫర్ వికెట్ తీసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మెయిడెన్ ఓవర్ పూర్తి చేశాడు. ఇలాంటి కీలక సమయంలో ఐదో ఓవర్ వేయడానికి కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా స్వయంగా బంతిని అందుకున్నాడు. ఆ ఓవర్లో ఒక నో-బాల్, రెండు వైడ్లతో సహా ఏకంగా 15 పరుగులు సమర్పించుకున్నాడు. ఉద్దేశపూర్వకంగానే ఆ ఓవర్లో భారీగా పరుగులు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ.కేవలం ఈ ఒక్క ఆరోపణే కాకుండా కెనడా క్రికెట్ బోర్డుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) మరికొన్ని విచారణలు కూడా జరుపుతోంది. జాతీయ జట్టులో కొందరు ఆటగాళ్లను ఎంపిక చేయాలని కోచ్ ఖుర్రం చౌహాన్, బోర్డు సభ్యులు ఒత్తిడి చేసినట్లుగా ఉన్న ఒక ఫోన్ కాల్ ఆడియో గతంలో లీక్ అయింది. దీనిపైనా ఏసీయూ దర్యాప్తు చేస్తోంది.ఈ ఆరోపణలపై ఐసీసీ ఇంటిగ్రిటీ యూనిట్ జనరల్ మేనేజర్ ఆండ్రూ ఎఫ్‌గ్రేవ్ స్పందించారు. ఈ డాక్యుమెంటరీ విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే విచారణ దశలో ఉన్న అంశాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఐసీసీ నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆరోపణలతో కెనడా క్రికెట్ బోర్డుతో పాటు టీ20 ప్రపంచకప్ పారదర్శకతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

## శ్రేయస్ క్యాచ్‌కు సచిన్ ఫిదా.. అద్భుతమంటూ కితాబు




**హైదరాబాద్ పెన్ పవర్:** గత రాత్రి ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఓ అద్భుతమైన క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆ క్యాచ్‌ను, తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటిగా అభివర్ణించాడు. కేవలం అథ్లెటిజం మాత్రమే కాదని, దాని వెనుక అద్భుతమైన అవగాహన, సమయస్ఫూర్తి ఉన్నాయని సచిన్ ప్రత్యేకంగా విశ్లేషించాడు.శ్రేయస్ అయ్యర్ క్యాచ్ గురించి సచిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... "బంతి వేగాన్ని, ఎత్తును అంచనా వేయడం, బౌండరీ లైన్ ఎక్కడుందో గమనించుకోవడం, దాన్ని తొక్కకుండా సరైన సమయంలో గాల్లోకి లేవడం.. ఇవన్నీ అద్భుతం. అంతటితో ఆగకుండా, గాల్లో ఉండగానే బంతిని పట్టుకుని, కిందపడేలోపు తన సహచర ఫీల్డర్‌కు అందించాడు. ఆ సమయంలో తన టీమ్‌మేట్ ఎక్కడున్నాడో కూడా కచ్చితంగా తెలిసి ఉండాలి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది" అని వివరించారు.ఇలాంటి ఫీట్ చేయాలంటే నమ్మశక్యంకాని అవగాహన, టైమింగ్, ఫిట్‌నెస్, సంయమనం అవసరమని సచిన్ తెలిపారు. "శ్రేయస్ అయ్యర్ అన్నింటినీ కచ్చితంగా అంచనా వేశాడు. నేను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది కచ్చితంగా ఒకటి" అని సచిన్ కొనియాడారు.

## పెళ్లి ఆలస్యంతో సమాజాన్ని జయించినట్లేనా?

క్లాసిక్ ఆఫ్-వైట్ చీర లుక్‌లో ప్రగ్యా నాగ్రా స్టన్స్





నటి కృతికా కమ్రా వివాహ బంధం - వ్యక్తిగత నిర్ణయాల పై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సాధారణంగా సమాజంలో వయసు రాగానే పెళ్లి చేసుకోవాలనే ఒత్తిడి ఉంటుంది. కానీ తాను 37 ఏళ్ల వయసులో వివాహం చేసుకోవడాన్ని సరైన నిర్ణయంగా అభివర్ణించారు. జీవితంలో ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం వల్ల ఎంచుకున్న భాగస్వామి పట్ల, నిర్ణయం పట్ల సంపూర్ణమైన స్పష్టత ఉంటుందన్నారు. ఆ సమయంలో ఏం చేస్తున్నామో? బాగా తెలుస్తుందని విశ్లేషించారు. తన స్నేహితులందరికీ పదేళ్ల క్రితమే వివాహాలు అయిపోయాయని గుర్తు చేసుకుంటూ వారంతా ఓ రకమైన సామాజిక ఒత్తిడి వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే కృతిక తల్లిదండ్రులు పెళ్లి విషయంలో ఎన్నడూ తనని ఒత్తిడి చేయలేదని దీంతో కావాల్సినంత సమయం దొరికిందన్నారు. కెరీర్ , వ్యక్తిగత జీవితంపై పూర్తి అవగాహన వచ్చిన తర్వాతే తాను వైవాహిక బంధంలోకి అడుగుపెట్టానని ఇది తనకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తుందన్నారు. గౌరవ్ కపూర్ - కృతికల వివాహం ఎంతో నిరాడంబరంగా కేవలం సన్నిహితుల మధ్య జరిగింది. భారీ హంగులు, డెస్టినేషన్ వెడ్డింగ్ వంటి ఆర్భాటాలకు తాము దూరంగా ఉన్నామన్నారు. -మాకు పెళ్లి వేడుక కంటే వివాహ బంధం అనేది చాలా పెద్ద విషయం అని స్పష్టం చేశారు. లోకానికి చూపించుకోవడానికి చేసే ఖర్చు కంటే ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితాన్ని పంచుకోవాలనే ఉద్దేశం బలంగా ఉండాలని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే పెళ్లి సమయంలో తన భర్త గౌరవ్ కపూర్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారని కృతిక గుర్తు చేసుకున్నారు. నిత్యం వందలాది మంది ముందు లైవ్ షోలు ఇచ్చే గౌరవ్, తమ వివాహ సమయంలో కన్నీళ్లు పెట్టుకోవడం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. కృతికను వధువు రూపంలో చూడగానే గౌరవ్ కళ్లలో నీళ్లు తిరగడం, ఆ బంధం పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనమని ఆనందం వ్యక్తం చేశారు.తన ప్రాణ స్నేహితుడిని భర్తగా పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పెళ్లి అనేది వ్యక్తిగత నిర్ణయమని అది ఎప్పుడు చేసుకోవాలనేది సదరు వ్యక్తులే నిర్ణయించుకోవాలని కృతిక సూచించారు. వయసును బట్టి కాకుండా మానసిక సిద్ధతను బట్టి అడుగు వేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే మరోవైపు వైవాహిక జీవితాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్నానన్నారు.

పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అంటే సమాజాన్ని ఓడించినట్లు కాదు. సమాజపు అసంబద్ధమైన ఒత్తిడికి తలొగ్గకుండా ఉండటమే. జీవితానికి మనం యజమానులమని, మన నిర్ణయాలు మనం తీసుకోగలమని నిరూపించడమే అసలైన విజయం. ఇది ప్రతి ఒక్కరి వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు గౌరవించుకుంటూ కలిసి ఉండాలని నిర్ణయించుకున్నప్పుడే ఆ వివాహం విజయవంతం అవుతుంది.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్ లేస్ మరియు పెర్ల్స్‌లో సొగసుగా, అభిమానులను విస్మయానికి గురి చేసింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965